క్లుప్తంగా

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

కేజీహెచ్‌కు జ్వర నియంత్రణ పరికరం అందజేత


పరికరంతో కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ తదితరులు

మహారాణిపేట: పిల్లల్లో జ్వరాన్ని నియంత్రించే ఎల్ఈడీ ఫొటోథెరపీ పరికరాన్ని జియో టెక్ హెల్త్ కేర్ సంస్థ కేజీహెచ్‌కు విరాళంగా ఇచ్చింది. 25 వేల రూపాయల విలువ చేసే ఈ పరికరాన్ని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కేజీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ జగదీష్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, బయో మెడికల్ ఇంజినీరు పి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల ఆందోళన


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న పీఏసీఎస్ ఉద్యోగులు

మహారాణిపేట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సహకార వ్యవసాయ ప్రాథికార పరపతి సంఘాల(పీఏసీఎస్) ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ పిలుపు మేరకు సోమవారం ఈ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.రామకృష్ణ మాట్లాడుతూ పీఏసీఏస్‌ల్లో 50 శాతం వాటాను ప్రైవేటు వ్యక్తులకు, కంపెనీలకు ఇస్తూ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ మల్లికార్జునకు 8 డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎల్.ఎ.ఆర్.ఆంజనేయులు, కోశాధికారి డి.మృత్యుంజయ రావు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

అల్లిపురం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక శాఖ సిబ్బంది సోమవారం పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జగదాంబ దరి సెవెంత్ డే అడ్వాంటిస్ట్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించా రు. అగ్నిప్రమాదాలు ఎలా చోటు చేసుకుంటాయి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ తదితర అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్‌కే రమణ, లీడింగ్ ఫైర్‌మెన్ బి.సూర్యప్రకాష్, ఏకే బాబు, ఫైర్‌మెన్ టి.శ్రీనివాస్, టి.ప్రేమ్‌కుమార్, కె.భూషణ్‌కుమార్, జి.రవికుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ డి.కుమార్, హెచ్ఎం చంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరమెట్ట భూసమస్యకు మోక్షమెన్నడో?


వేంకటేశ్వరమెట్టపై శ్రీవారి ఆలయం

- రిజిస్ట్రేషన్లు కాక క్రయ, విక్రయాలకు ఇబ్బందులు
- చుక్కల భూముల వలే పరిష్కరించాలని స్థానికుల విజ్ఞప్తి

అల్లిపురం: నగరం నడిబొడ్డున ఉన్న వేంకటేశ్వర మెట్టపై నివాసితులు తమ ఇళ్లకు రిజిస్ట్రేషన్లు కాక నానా అవస్థలు పడుతున్నారు. 1450 సర్వే నంబర్ పరిధిలో భూసమస్యకు మోక్షం ఎప్పుడు లభిస్తోందనని ఆశగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 22ఏ(1) ఇ నుంచి నిషేధిత భూములను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో దేవదాయ, వక్ఫ్ భూములను క్రమబద్ధీకరించేందుకు మార్గం సుగమమైంది. అదే విధంగా వెంకటేశ్వరమెట్టపై ఉన్న నివాసితుల సమస్య కూడా పరిష్కరించాలని బాధితులు కోరుతున్నారు. దశాబ్దాల కాలంగా వెంకటేశ్వరమెట్టపై 1450 సర్వే నంబర్‌లో ఉన్న ఇళ్లకు దేవదాయ శాఖ అధికారులు రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. దీంతో ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం గానీ, అనారోగ్యం కారణంగా డబ్బులు అవసరమై ఇంటిని అమ్ముకుందామంటే రిజిస్ట్రేషన్ కాక ఎవరూ కొనడానికి ముందుకు రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు దేవదాయ శాఖ అధికారులు నోటీసులు పంపిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు. దేవుడుకి సేవ చేసుకుంటే మంచి చేస్తాడని భావిస్తుంటే, ఆ దేవుడే సమస్య అయితే ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చుక్కల భూముల వలే పరిష్కరించాలి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 22 ఏ (1) ఇ నుంచి చుక్కల భూములకు ఎలా విముక్తి కల్పించారో అలాగే వెంకటేశ్వరమెట్ట సమస్యను పరిష్కరించాలి. ఈ ప్రాంతంలో ముత్తాతల కాలం నుంచి సుమారు 9 దశాబ్దాలుగా కుటుంబాలతో నివసిస్తున్నాం. పక్కా డాక్యుమెంట్లు, ఇంటి పన్నులతో సర్వ హక్కులు కలిగి ఉన్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ సమస్యను పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం.

– భీశెట్టి నరసింహమూర్తి(శ్రీను), ఎస్‌వీజీఎస్ అధ్యక్షుడు

ఇళ్ల మరమ్మతులకూ అడ్డంకి



మా తాతల కాలం నుంచే ఇక్కడ ఉంటున్నాం. గత 12 సంవత్సరాలుగా వెంకటేశ్వరమెట్ట దేవస్థానం అధికారులు 1450 సర్వే నంబర్‌లో రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. దీంతో మా అవసరాలకు ఇళ్లు అమ్మాలన్నా, కొనాలన్నా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇళ్లు కట్టుకోవాలన్నా, పడిపోతున్నాయని రిపేరు చేసుకోవాలన్నా దేవదాయ శాఖ సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారు. మా సమస్య పరిష్కరించకపోతే వచ్చే సాధారణ ఎన్నికలను బాయ్‌కాట్ చేస్తాం.

– నూరిశెట్టి శ్రీనివాస్, వేంకటేశ్వరమెట్ట

వినతులు ఇచ్చినా ఫలితం శూన్యం



మా సమస్య పరిష్కరించాలని పలుమార్లు కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చినా పరిష్కారం కాలేదు. రాజకీయంగా వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ వి.విజయసాయిరెడ్డి, నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంకటేశ్వరమెట్ట సమస్యను పరిష్కరించాలి. 22ఏ నుంచి 1450 సర్వే నంబర్‌ను తొలగించాలని వేడుకుంటున్నాం.

– బొడ్డేటి అమృత ప్రసాద్, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి

పోలీసుల అదుపులో నిందితుడు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో ఓ తొమ్మిదేళ్ల బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిని ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక 40 గజాల కాలనీకి చెందిన బాలికను గుర్తు తెలియని యువకుడు ఈ నెల 9న మాయ మాటలు చెప్పి బైక్‌పై ముడసర్లోవ సమీప నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. దీనిపై బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఆరిలోవ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును దిశ పోలీసులకు అప్పగించారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న యువకుడు ఎట్టకేలకు సోమవారం పోలీసులకు చిక్కాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న దిశ పోలీస్ స్టేషన్ ఏసీపీ సీహెచ్.వివేకానంద్, ఆరిలోవ సీఐ సోమశేఖర్, సిబ్బందితో కలసి సంఘటన జరిగిన ముడసర్లోవ ప్రాంతాన్ని పరిశీలించారు. నిందితుడి నుంచి పూర్తి వివరాలు సేకరించడం కోసం ఈ వ్యవహారాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. నిందితుడిని పోలీసులు మంగళవారం కోర్టులో హాజరుపరచనున్నట్టు తెలిసింది.

కుమారుడితో మహిళ అదృశ్యం


ఇందు (ఫైల్)

బీచ్ రోడ్డు: కుమారుడితో పాటు ఓ మహిళ అదృశ్యమైన ఘటనపై మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్ వెనక వైపు నివాసం ఉంటున్న నందిని ఇంటికి ఆమె చెల్లి ఇందు ఈ నెల 9న తన కుమారుడితో వచ్చి ఉంటోంది. అయితే ఈ నెల 13న నందిని.. ఇందు భర్త సంతోష్‌కు ఫోన్ చేసి పిల్లవాడుతో పాటు ఇందు ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని చెప్పింది. దీంతో సంతోష్ కుటుంబ సభ్యులు, స్నేహితులను వాకబు చేయగా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ మేరకు సోమవారం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘ఉక్కు’ ప్రైవేటీకరణపై ద్వంద్వ వైఖరి తగదు



నరసింహనగర్ కూడలిలో ధర్నా చేస్తున్న వామనమూర్తి, ఇతర నాయకులు

సీతంపేట: కేంద్ర ఉక్కు సహాయక మంత్రి ఫగాన్ సింగ్ కులస్తే ద్వంద్వ వైఖరి విడనాడాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నరసింహనగర్ కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిలిపివేస్తామని, ప్లాంట్. అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని ప్రకటించిన కేంద్ర మంత్రి.. సాయంత్రమయ్యే సరికి మాట మార్చేశారని మండిపడ్డారు. ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు అని రెండేళ్లుగా చేస్తున్న నిరసనలు, ధర్నాలను విచ్ఛిన్నం చేయడానికే ఫగాన్ సింగ్ అటువంటి వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, ఐరన్‌ఓర్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రావికృష్ణ, కేలం శివ, కె.శ్రీను, పి.సాయికుమార్, జి.సూర్యారావు, డి.మహాలక్ష్మినాయుడు, బి.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యమాంబ జాతరకు ఏర్పాట్లు

- 19న తొలేళ్లు, 20న ప్రధాన పండగ
- ముస్తాబవుతున్న ఆలయం




రంగులద్దుకుంటున్న ఆలయ గోపురం

కంచరపాలెం: కంచరపాలెం కూడలిలో కొలువైన ముత్యమాంబ అమ్మవారి వార్షిక నవరాత్రి జాతర మహోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ నెల 19న తొలేళ్ల సంబరంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు, పుట్టబంగారం ఆలయం వద్ద పూజాధికాలు జరపనున్నారు. 20వ తేదీన ప్రధాన పండగ, 27వ తేదీన అమ్మవారి మారువారం జాతర, అన్నదానం నిర్వహించనున్నట్లు గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘ సభ్యులు తెలిపారు. ఆలయ పరిసరాలు, గాలి గోపురాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు, సాంస్కృతిక, నృత్య కార్యక్రమాల నిర్వహణకు వేదికలను, విద్యుత్ దీపాలంకరణలు సిద్ధం చేస్తున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

జోన్-5 ఏపీడీగా శైలజ బాధ్యతల స్వీకరణ


విధుల్లో చేరిన ఏపీడీ శైలజ, సీడీవోలతో జోనల్ కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 యూసీడీ ఏపీడీగా శైలజ సోమవారం బాధ్యతలు చేపట్టారు. జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణకు ఆమె తన నియామక పత్రాన్ని అందజేశారు. శైలజతోపాటు కమ్యూనిటీ ఆర్గనైజర్లుగా జోన్–5కు 16 మందిని జీవీఎంసీ ప్రాజెక్ట్ అధికారి నియమించడంతో వారంతా విధుల్లో చేరారు. జోన్-5 పరిధిలోని 24 వార్డుల్లో సీడీవోలను నియమించనున్నట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు.

‘జోన్-5’కు ఆరు వినతులు


స్పందన వినతులు పరిశీలిస్తున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ వినతులు స్వీకరించారు. జీవీఎంసీ 40వవార్డు నుంచి 63వ వార్డులకు సంబంధించి నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 06 వినతులు అందాయి. వాటిలో టౌన్‌ప్లానింగ్ విభాగానికి 02, రెవెన్యూ విభాగానికి 02, యూసీడీ విభాగానికి 02 వినతులు అందినట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు. అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు జెడ్సీ సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్–1, 2 టీఎస్ఎస్ రాజు, ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వో బాబూరావు, ఈఈలు శ్రీనివాసరావు, టి.ప్రసన్న రెడ్డి, వాటర్ డీఈ శ్రీనివాసవర్మ, టౌన్‌ప్లానింగ్ టీపీవో ఎం.శ్రీలక్ష్మి, అపరంజిత, ఏపీడీ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

రోల్ మోడల్‌గా యువత నిలవాలి

ఏయూ క్యాంపస్: భవిష్యత్తు తరానికి ప్రస్తుత యువత రోల్‌మోడల్‌గా నిలవాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో నిర్వహించిన ఐఏఎస్ఈ ఫ్రెషర్స్‌డే వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులుగా మీరంతా మారా లని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలకు వీసీ బహుమతులు అందజేశారు.

ఇంటింటా ‘జగనన్నే మా భవిష్యత్తు’


33వ వార్డులో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న రంథి గోపీ తదితరులు


32వ వార్డులో ఓ ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న బోణి దేవ, బంగారమ్మ

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు పరిధి వెంకటేశ్వరమెట్టలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా సాగింది. వెంకటేశ్వరమెట్ట పరిసర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రంథి గోపీకృష్ణ, పార్టీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్‌తో కలసి గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందజేయాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు మహిళా అధ్యక్షురాలు యల్లంకి చిన్నమ్ములు, వెంకటలక్ష్మి, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

➡ 32వ వార్డులో పార్టీ వార్డు మహిళా అధ్యక్షురాలు వాసుపల్లి బంగారమ్మతో కలసి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోణి దేవ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహసారథులు, వలంటీర్లతో కలిసి, గడప గడపకు వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లు అంటించారు. మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరించారు.

సీవో రత్నానికి సత్కారం


సీఓ రత్నాన్ని సత్కరిస్తున్న రంథి గోపి, బొడ్డేటి ప్రసాద్ తదితరులు

అల్లిపురం: బదిలీపై వెళ్తున్న జీవీఎంసీ జోన్–4 సీవో డి.రత్నంను 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది ఘనంగా సత్క రించారు. వెంకటేశ్వరమెట్ట సచివాలయంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రంథి గోపీకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను సన్మానించారు. ఏపీడీవో కె.వి.పద్మావతిని ఇన్‌చార్జిగా నియమించడంతో ఆమెకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, నగర కార్యదర్శి మేడం నారాయణరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ కర్రి నీలకంఠం, ఆడారి వెంకట మహేష్, మహిళా అధ్యక్షురాలు యల్లంకి చిన్నమ్ములు, కొడమంచిలి శ్రీను, ఆర్పీలు, సచివాలయ కార్యదర్శులు పీవీ కిరణ్‌కుమార్, జాన్‌బాబు, కృష్ణకుమారి, చందు పాల్గొన్నారు.

సెయింట్ ఆంథోనీ హైస్కూల్ కొనసాగింపునకు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ కార్యదర్శి నితిన్

డాబాగార్డెన్స్: ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పి, ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాలను యథావిధిగా కొనసాగించేలా చర్యలు చేపట్టాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) కార్యదర్శి ఉమ్మిడి నితిన్ కలెక్టర్ మల్లికార్జునను కోరారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి, కలెక్టర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నితిన్ మాట్లాడుతూ చరిత్ర గల సెయింట్ ఆంథొనీ ఉన్నత పాఠశాలను యాజమాన్యం మూసివేస్తున్నట్టు విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారన్నారు. ఇక్కడ చదువుతున్న పిల్లల తల్లిదండ్రులంతా పేదలని.. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదివించే స్తోమత లేనివారని తెలిపారు. పాఠశాల యథావిధిగా కొనసాగేలా చర్యలు చేపట్టాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏబీవీపీ నాయకులు కిరణ్, ఎల్లాజీ తదితరులున్నారు.

‘అడ్వర్టయిజ్‌మెంట్ ట్యాక్స్ రద్దు చేయాలి’


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గంగారావు

డాబాగార్డెన్స్: మెడికల్ షాపులు, హాస్పిటల్స్, చిన్న చిన్న కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌పై జీవీఎంసీ భారీగా విధించిన అడ్వర్టయిజ్‌మెంట్ ట్యాక్స్ ఉపసంహరించాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బి. గంగారావు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా అత్యవసర సర్వీసులపై కూడా అడ్వర్టయిజ్‌మెంట్ ట్యాక్స్ విధించడం చట్ట విరుద్ధమన్నారు. ఇప్పటికే ఆ సంస్థలపై జీవీఎంసీ భారీగా ఆస్తిపన్ను విధించిందని, వాటర్ చార్జీలు పెంచడంతో పాటు ట్రేడ్‌లైసెన్స్ రెండు రెట్లు పెంచిందని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో అడ్వర్టయిజ్‌మెంట్ ట్యాక్స్ విధించడంలో, వసూళ్లలో భారీ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. చాలా ఏజెన్సీ బోర్డులకు నిబంధనల ప్రకారం పన్ను కూడా విధించడం లేదని, జీవీఎంసీ కోట్లాది రూపాయలు కోల్పోతుందన్నారు. ఈ అక్రమాలపై ఎలాంటి ఆడిట్ జరపడం లేదన్నారు. వీటిని పరిశీలించాలని కోరారు.

వార్డుల్లో పారిశుధ్యం మెరుగుకు కృషి

- అధికారులకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ సూచన
- 13వ వార్డులో విస్తృత పర్యటన


లక్ష్మీనగర్‌లో గెడ్డలో పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

ఆరిలోవ: వార్డుల్లో పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ శానిటరీ విభాగం అధికారులకు సూచించారు. జీవీఎంసీ 13వ వార్డు పరిధి లక్ష్మీనగర్, ఎర్నిదుర్గానగర్ ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో గెడ్డలు, కాలువలు, రోడ్లు పరిశీలించారు. ఎర్నిదుర్గానగర్, లక్ష్మీనగర్ మధ్య కాలువ గోడలు శిథిలావస్థకు చేరడం, ఆ గెడ్డలో స్థానికులు పాలిథిన్ కవర్లతో మూటలు కట్టి పడేసిన చెత్త పేరుకుపోవడాన్ని ఆయన గమనించారు. దీనిలో చెత్త వంటనే తొలగించి శుభ్రం చేయించాలని స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న గెడ్డ గోడల నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. దీనిలో స్థానికులు చెత్త వేయకుండా అవగాహన కల్పించి, నియంత్రించాలని చెప్పారు. అనంతరం స్థానికులతో ఆయన మాట్లాడి తడి, పొడి చెత్త వేర్వేరుగా అందజేసి పారిశుధ్య కార్మికులకు సహకరించాలని సూచించారు. అనంతరం ముడసర్లోవ వద్ద డంపింగ్‌యార్డును సందర్శించారు. ఇక్కడ రోజుకు ఎన్ని టన్నులు చెత్త వస్తుంది, ఈ చెత్త ఎక్కడికి తరలిస్తున్నారు, ఇళ్ల నుంచి చెత్తను సేకరించడానికి ఎన్ని వాహనాలు ఉన్నాయి.. తదితర అంశాల గురించి సంబంధిత అధికారులను ఆరా తీశారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ కెల్ల సునీత, అడిషనల్ కమిషనర్ వి.సన్యాసిరావు, జెడ్సీ కనకమహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రచార భేరి’ సభను జయప్రదం చేద్దాం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కంచరపాలెం: సీపీఎం కంచరపాలెం జోన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రైతుబజార్ వద్ద ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు ఒమ్మి అప్పారావు మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించి దేశాన్ని కాపాడాలనే నినాదంతో ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. ఈ నెల 26న విశాఖ స్టీల్‌ప్లాంట్ కూర్మన్నపాలెం గేటు దగ్గర నిర్వహించే బహిరంగ సభలో సీపీఎం పోలిట్ బ్యూరో సభ్యుడు, బీవీ రాఘవులు, సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు నారాయణ పాల్గొంటున్నారని చెప్పారు. ప్రజలందరూ తరలివచ్చి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.ఈశ్వరరావు, పి.పూర్ణ, వరలక్ష్మి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

25న శ్రీశ్రీపై క్విజ్ పోటీ

సీతంపేట: శ్రీశ్రీ జయంతి సందర్భంగా ఈ నెల 25వ తేదీ సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శ్రీశ్రీ జీవితం, సమగ్ర సాహిత్యంపై క్విజ్ పోటీ నిర్వహించనున్నట్టు విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాత పరీక్ష ఉంటుందని, వన్ వర్డ్ ఆన్సర్స్ రూపంలో రాయాల్సి ఉంటుందన్నారు. 30 ఏళ్లలోపు వారు(జూనియర్స్) ఒక విభాగంగా, ఆపై వయస్సు ఉన్నవారు (సీనియర్స్) మరో విభాగంగా పోటీ జరుగుతుందని చెప్పారు. రెండు విభాగాలకు విడివిడిగా ప్రథమ బహుమతి రూ.1,000, ద్వితీయ బహుమతి రూ.750 ప్రదానం చేస్తామన్నారు. ఈ నెల 30న అంకోశాలో జరగనున్న శ్రీశ్రీ జయంతి వేడుకల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. పోటీలో పాల్గొన దలచిన వారు వారి పేర్లను వాట్సాప్ ద్వారా ఈ నెల 20లోగా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. డాక్టర్ డి.వి.సూర్యారావు 98851 88431, మేడా మస్తాన్‌రెడ్డి 94413 44365 నంబర్లకు వాట్సాప్ చేయాలని కోరారు.